ఎవరేమన్నాసరే, ఈ కథకు "నాయకుడు" బ్రహ్మశ్రీ కామయ్య మాస్టారే.

• • •

సరిగా మధ్యాహ్నం 12 గంటలకల్లా కట్రపాటినుండి గ్రామ మోతాదు "ఎలకతుర్తి" పోలీసు స్టేషన్‌కు ఉరుకులు పరుగులతో వచ్చిపడి ఇన్‌స్పెక్టర్‌గారికి మునసబుగారు వ్రాసియిచ్చిన కాగితం సమర్పించుకొన్నాడు.

"—గ్రామంలో నారాయణరావుగారి పార్టీకీ, నరసింహంగారి పార్టీకీ కక్షలు పెరిగి దొమ్మీలకు దారితీసే ప్రమాదం ఏర్పడుతోంది. తెల్లవారాక ఘోర దురంతాలు జరుగవచ్చు. బందోబస్తు అవసరం; తగిన సిబ్బందితో దయచేయ ప్రార్థన. విధేయుడు గ్రామ మునసబు."

జాబును చూచుకొని ఇన్‌స్పెక్టర్ క్షణకాలం ఆలోచనలో పడిపోయాడు.

"దొమ్మి జరుగుతుం దంటావా ?"అన్నారు.

అట్టాగానే అనుకొంటున్నారయ్యా— ఊరంతా అన్నాడు మోతాదు.

"సరే. అలాగే రేపు బందోబస్తుతో వస్తున్నాను. నీవు పద!" అంటూ,ఈ విషయాన్ని పై అధికారులకు తెలియచేయ 'నికి ఫోను ఎత్తాడు ఇన్‌స్పెక్టరు.

• • •

కట్రపాడు మారుమూలనున్న పల్లెటూరు. అయినా మోతుబరి రైతులున్న గ్రామం. పార్టీలకు, ద్వేషాలకు, కక్షలకు పేరుమోసిన గ్రామం. నారాయణరావుగారూ, నరసింహంగారూ చెరి ఒక పార్టీకి నాయకులు. ఇద్దరి వయసు దగ్గర దగ్గర 50 సంవత్సరా లుంటుంది. దగ్గర దగ్గర అంతటి జీవితాన్ని వారు కోర్టుల చుట్టూ తిరగటంతోనే గడిపారు. ఆ గ్రామానికి కొట్లాటలు, పోట్లాటలు, విధ్వంసక చర్యలు వార్షికాలుగా వచ్చిపోతూ వుండేవి గతంలో—వీరి హయాములో అవి అర్ధ సంవత్సరీకాలుగా ప్రారంభమై త్రైమాసికాలుగా రూపొంది, మాసికాలుగా మార్పు జెంది, ఈమధ్య దైనికాలు అయి వూరుకొన్నాయి.

నారాయణరావుగారు వారి 50 ఏళ్ళ జీవితంలోను, ఒకటి అటు, ఇటుగా 50 హత్యలు చేయించారని ప్రతీతి. నరసింహంగారు 50 దొమ్మీలు చేయించారని ప్రభుత్వమే ఒప్పుకొంది. వా రిద్దరి మధ్య పడ్డ పచ్చగడ్డి మాట అటుంచి "మంచుగడ్డలే" భగ్గున మండిపోతాయి.

ప్రతి నూతన సంవత్సరారంభంలోను, ఒక నూతన విషయం దొరుకుతుంది వారికి. దాని మీద వారి వారి అభిప్రాయాలను, విధానాలను ఏర్పరచుకొంటారు. వినాదాలను సృష్టిస్తారు: సరదాగా పోట్లాడుకొని కొట్టుకొంటారు. ఉదాహరణకు— ఒక సంవత్సరం నారాయణరావుగారి పార్టీ కొలుపులు ప్రారంభించారు; ఎదుటి పార్టీ వారు 'కొలుపుల నిరోధక' కార్యక్రమం రూపొందించారు. మరో సంవత్సరం నరసింహంగారి పార్టీ "ఎద్దుల పందెము" పెట్టింది. తీరా

ఈ కథ ఆర్జించే 'కీర్తి'
బ్రహ్మశ్రీ కామయ్య
మాస్టారికి అంకితం—
["అపకీర్తి" నాదే]
—రచయిత.

ఆనాటికి "ఎద్దుల" అనే పదం పోయి "మనుషుల" పందెమయింది, ఎదుటివర్గం వారితో.

• • •

ఇంతకూ ప్రస్తుత వివాదము కొంచం క్లిష్టమైనదీను, విచిత్రమైనదీను.

ఆ గ్రామంలో దక్షిణపు దిక్కుగా, ఊరికి చిట్ట చివరన ఏనాడో నిర్మించిన కోవెల వుంది. దానిలో శ్రీ మల్లిఖార్జునస్వామివారు వెలవు తీరారు. ఆ గుడి కట్టడం పురాతనమైన దవటంతో శిధిలావస్థలో వుంది.

ఒకనాటి రాత్రి నారాయణరావుగారికి కలలో శ్రీ మల్లిఖార్జునస్వామి ప్రత్యక్షమై "నాయనా, నా ఆలయం శిథిలమైపోతున్నది. నేనలా ఎండకు ఎండి, వానకు తడిసి పోవాలిసిందేనా?" అంటూ క్షణకాలం తన సాధక బాధకాలను గురించి చెప్పుకొని—ఆలయోద్ధరణ జరుపు అని చెప్పుకొన్నాడట. అంతే.తెల్లవారేసరికి నారాయణరావుగారిలో ప్రగాఢ భక్తి విశ్వాసాలు, మొక్కవోని ఆస్తికత్వం పెల్లుబికాయి. తనవారిని నలుగురిని పిలిచి తన స్వప్న వృత్తాంతమంతా చెప్పి, "ఏమైనాసరే ప్రస్తుత దేవాలయాన్ని పడగొట్టి మరో నూతన దేవాలయాన్ని నెలకొల్పవలసినదే" అనే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. అంతాసరే అన్నారు.

చైత్రశుద్ధ ఏకాదశి ఆలయోద్ధరణ కార్యక్రమానికి ముహూర్తంగా నిశ్చయింపబడింది. ఆ ముహూర్తంనాటికి కావలసిన వస్తువులు, పరికరాలు సమకూర్చటానికి ప్రయత్నాలు చేశారు. కావలసిన వస్తువులు, పరికారాలు మరేమున్నాయి కనక—? ఎలాగూ అవతల పార్టీవారు, ఎదుర్కొంటారు. దొమ్మీ జరుగుతుంది. కాబట్టి కత్తులూ, బరిసెలూ, కర్రలూ మగవారికి. చేతికొందికి విసరటానికి రాళ్ళు, చేతికొందికి వెదజల్లటానికి 'కారం' ఆడవారికి.

నారాయణరావుగారిలో పెల్లుబికిన ఆస్తికత్వం లాంటిదే నరసింహంగారిలోను పొంగి పొర్ల సాగింది. ఎటొచ్చీ దారి వేరు. "ఏనాడో ప్రతిష్ఠింపబడిన స్వామివారి ఆలయాన్ని పెకలించటమా? ఏమైనాసరే, ఈ ఘోర దురంతాన్ని ఎదుర్కొని ధర్మభ్రష్టత జరగకుండ చూడవలసినదే"అని నిశ్చయించారు నరసింహారావుగారు.

మరో విషయం. నారాయణరావుగారి కలలో కన్పించిన భగవంతుడే, ఆ దుస్తులన్నా విప్పకుండా అదే రూపంలో నరసింహంగారి కలలో కన్పించి, "నాయనా నాకీ స్థల భ్రష్టత ఏమిటి. సజీవుణ్ణి నన్ను పెరికిపారవేయటమేనా" అని గొల్లుమన్నాట్ట.

ఏమయితేనేం! అదే ముహూర్తానికి మల్లిఖార్జునస్వామివారి ఆలయోద్ధరణ సంఘ కార్యక్రమాన్ని ఎదుర్కొనటానికి సర్వ సన్నాహాలు పూర్తి చేయటం ప్రారంభించారు.

ఆ గ్రామంలో మరో విశేషముంది. ఏ పార్టీకి చెందని వ్యక్తులు ఇద్దరున్నారు. ఒకరు, గ్రామ మునసబు "సౌరయ్య"గారు. మరొకరు వీధి బడి పంతులు కామయ్యగారు.

మునసబు సౌరయ్యగారు అధికారులు వచ్చిన నాడుతప్ప బయట కన్పించడు. వంశపారంపర్యంగా వస్తున్న ఉబ్బసంతో బాధపడుతూ పంచపాళీలో ఒక ప్రక్క మంచంమీద ఒదిగి పండుకొని వుంటాడు. ఏనాడూ వీరిది తప్పు, వారిది ఒప్పు అని అధికారులకు చెప్పడు. గ్రామంలో కొట్లాటలు జరిగిన తరువాత పోలీసు వారలు, అధికారులు, 'కర్రల' ఎన్ని విని వారం రోజులు తటవారు రావలసినదేగాని 'రిపోర్టు' చేయడు.

అందుకని రెండు పార్టీల దృష్టిలోను, మునసబు సౌరయ్య కనిపించని పదార్థం: ఒక 'రెడు'.

ఇక, కామయ్యగారు పంచ కావ్యాలుచదివాడని, వ్యాకరణంలో దిట్ట అని, అలంకార శాస్త్రం ఆయనకు కరతలామలకమని అంటారు. ఏమయితేనేం, పొట్ట పట్టుకొని "కట్రపాడు" వీధి బడి పంతులుగా వచ్చాడు. ఆయన ఆ ఊరి ప్రజల దృష్టిలో చిన్నజీవి. పురుగు, చీమ, దోమ—అంత కన్నా హీనం—అసలు "శూన్యం".

• • •

శ్రీ మల్లిఖార్జునస్వామి మరో గమ్మత్తు చేశాడు. అలా నారాయణరావుగారిలో, నరసింహంగారిలో సంచలనం లేవదీసిన ఆ పెద్ద మనిషే, గ్రామ మునసబు సౌరయ్యకు కలలాంటి మైకంలో కన్పించి—"నాయనా! సౌరీ! గ్రామాధికారివి; వారలా నా పేరిట కలహించుకొని తలలు పగుల కొట్టుకోవటం ఏమన్నా బాగుందా? లే! ఆ దురాగతాన్ని ఆపు. అశక్తుడ నంటావా? మానవ ప్రయత్నం నీవు చేయి. దైవ ప్రయత్నం నేను

గంధం యాజ్ఞవల్క్యశర్మ

చేస్తాను. ఈ రక్తపాతాన్ని ఆపివేద్దాం" అంటూ హెచ్చరించాట్ట.

అంతేకాదు. అంతర్ధాన మవ్వబోతూ ఒక్క అడుగు వెనక్కువేసి "ఇదిగో, ఈ ఘోర దురంతాన్ని ఆపివేయగలవా, నీ పుణ్యం పూరికేపోదు. ఆ ఉబ్బసం వ్యాధిని మటుమాయం చేస్తాను" అంటూ ఆశ చూపి మరీ వెళ్ళాట్ట.

ఏనాడూ గ్రామ కొట్లాటలను గురించి యోచించని సారయ్య క్షణకాలం తలుపులు మూసుకొని ధైర్యాన్ని చిక్కబట్టుకొని మౌనంగా యోచించాడు. తనకు బలంలేదు. తన మాటకు శక్తిలేదు. ఏమిటి చెయ్యటం? మెరుపులా తట్టింది. ఈ కొట్లాటకు ముందే పోలీసువారికి రిపోర్టు ఇస్తే—వారే ఈ దొమ్మీని ఆపివేస్తారు. "ఇదీ నా ప్రయత్నం. ఇక పైన భగవంతుడు తనపాలు చూసుకొంటాడు." అంతే నిశ్చయించాడు.

దేవాలయోద్ధరణ కొట్లాట ఉత్సవం అన్న ముందు రోజు తనకు నమ్మినబంటు మోతాదు వీరయ్యను పిలిచి రహస్యంగా విషయం చెప్పి, 'రిపోర్టు' వ్రాసి, పోలీసు బలగంతో దిగమని "ఎలకతుర్తి" పోలీసు ఠాణాకు పంపాడు. అలా పంపాక క్షణకాలం వణికిపోయి పంచపాళిలోని తన మంచాన్ని పడక టెంటిలోనికి మార్పించుకొని, పంచ ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని శ్రీ మల్లిఖార్జునుణ్ణి జపించుకొంటూ వుండిపోయాడు.

మోతాదు వీరయ్య, "ఎక్కడి"కంటూ అడిగిన వారికి "మా పెద్దమ్మాయిని చూచి రావటాని"కని చెప్పుకొంటూ వూరికి తూర్పుగావున్న 'ఎలకతుర్తికి' దక్షిణంగా తన ప్రయాణాన్ని సాగించి, కొంత దూరం వెళ్ళాక మరో నాలుగు వూళ్ళు చుట్టవేసి—ఎలకతుర్తి చేరుకొన్నాడు.

* * *

తెల్లవారితే ఏకాదశి అనగా, నిద్రపట్టక మంచంమీద కూర్చుని తీరిగ్గా, ఆయాసపడుతోన్న మునసబు సారయ్య దగ్గరకు, ఆగ మేఘాలమీద మోతాదు వీరయ్య వచ్చి "7,8 గంటలకల్లా పోలీసువారు వస్తున్నారయ్యా" అంటూ విన్నవించుకొన్నాడు. "వస్తున్నారా" అని ప్రశ్నించి, అవుననిపించుకొని దగ్గుతెర తగ్గించుకొని స్థిమితపడ్డాడు సారయ్య, "భారం అంతా నీదే మల్లిఖార్జునస్వామీ" అనుకొంటూ.

కట్రపాటిలో ఆ రోజు తెల్లవారింది. నారాయణరావుగారి అభిమానులు, అనుయాయులు, సరిగ్గా 10 గంటలకు దేవాలయం దగ్గరకు చేరుతారు. సరిగా అదే సమయానికి నరసింహంగారి పార్టీవారిని ఢీకొంటుంది. ఇదీ కార్యక్రమం.

కాని, ఆకస్మాత్ సంఘటన ప్రొద్దున్నే జరగటంతో కథ తన రూపాన్ని మార్చుకొంది.

కామయ్య మేస్టారి దినచర్య ఊరి ప్రక్కనున్న సెలయేటి స్నానంతో మొదలవుతుంది ప్రతి నిత్యం. ఆ రోజు తెల తెలవారుతూ వుండగా

# కథానాయకుడు

కామయ్య మేస్టారు సెలయేటి స్నానానికి బయలుదేరారు. ఊరి "మరగొమ్ము" దాటే సరికి జొన్న చేలోనుండి ఒక ముసుగు బయటకు వస్తూ కన్పించింది. ఆ ముసుగును చూచి దడుసుకొన్న మేస్టారు ఎవరది" అని అనేశారు. "నేనేలే నీ దారిన వెళ్ళవయ్యా పంతులూ" అందా స్త్రీ కంఠం వెటకారంగా.

ఆ ముసుగు, అలా తెల్లవారుజామున తిరిగేదే అని విన్న కామయ్య మేస్టారు 'శివశివా' అనుకొంటూ మరో పదిగజాలు నడిచేసాటికి, నారాయణరావుగారి కొడుకు సత్యంకంగారుగా గ్రామం వెళ్ళటం కన్పించింది. 'పాహిమాం పాహిమాం' అనుకొన్న మేస్టారికి మంచె చాటునుండి మరో ముసుగు తాటాకు పండ్లు పట పటలు వినిపించాయి— "పరంధామా పరంధామా" అనుకొని, ఏకాయకిని, ఏటిపాయ దగ్గరకువెళ్ళి ప్రాతః సంధ్యలో పాపపు ముఖాలను చూచిన పాపానికి ప్రాయశ్చిత్త కర్మ చేసుకుని స్నానం చేయటంలో నిమగ్నమయ్యాడు కామయ్య మేస్టారు.

* * *

ఊరి మొగలో 7 గంటలకల్లా మరణావస్థలో వున్న నారాయణరావుగారి కుమారుని చుట్టూ జనం చేరారు. ఆ జనం మధ్యలో నెత్తిన ముసుగుతో మాణిక్యం నిలుచునివుంది.

"ఎలా జరిగిందీ దురంతం?" అని ప్రశ్నించిందో కంఠం.

"ఎలాగైతేనేం జరిగింది మాటకు మాట, దెబ్బకు దెబ్బ, ఖూనీకి, ఖూనీ. కానివ్వండి. ఆ నరసింహం మేనల్లుణ్ణి మనం ఖూనీ చేద్దాం" అన్నదో కంఠం. నారాయణరావుగారు క్షణకాలం కర్తవ్య విమూఢుడైనా, మరుక్షణం తనవారిని "సర్వ సిద్ధంకండి, దెబ్బకు దెబ్బ తీయాలిసిందే" అన్నారు. అంతే నారాయణరావుగారి పార్టీ కనురెప్పపాటులో ఆయుధాలతో సిద్ధమై వచ్చారు.

ఈ వార్త తెలిసిన నరసింహంగారు సాక్షాత్తు నారసింహావతారాన్నే తాల్చారు. మరుక్షణంలో తనవారి నందరిని వెంట తీసుకొని వూరి మొగ జేరారు ప్రత్యర్థులను ఎదుర్కొనటానికి.

10 గంటలకు నిర్ణయించిన ముహూర్తం 8 గంటలకే వచ్చి కూర్చుంది అవసర లగ్నంలా. ఆ క్షణంలో కట్రపాడు గ్రామమంతా కోలాహలంతో నిండుగా కోపంతో ఉవ్వెత్తుగా, క్రోధంతో ఎర్రగా మారిపోయింది.

రెండు పార్టీలు తారసిల్లి తీరా మోసి దొమ్మీ ప్రారంభం కాబోయేసరికి 'రయ్'మంటూ పోలీసు వానులువచ్చి రెండు పార్టీలమధ్య ఆగినయ్. ఇంత అకస్మాత్తుగా పోలీసువారలు వూడిపడినందుకు అంతా క్షణకాలం నిశ్చేష్టులై తెల్లపోయారు.

తుపాకి కర్రలు ముందు—తరువాత పోలీసులు దిగారు. ఇన్‌స్పెక్టరుగారు పోలీసు వ్యాన్‌లో నుండి ప్రజావాహినిని హెచ్చరించారు—"శాంతియుతంగా ప్రవర్తించమని, ఆయుధాలను పోలీసు వారికి అప్పగించి లొంగిపొమ్మని, లేని యెడల దౌర్జన్యాన్ని ఎదుర్కొనటానికి కాల్పులకైనా జరపటానికి వెనుకాడరని—"

నారాయణరావుగారు ఇన్‌స్పెక్టరుగారి దగ్గరకు వెళ్ళి తన కుమారుని నరసింహంగారి మేనల్లుడు ఎలా కత్తితో పొడిచిందీ వివరించి చెప్పారు. వెంటనే ఇన్‌స్పెక్టరు, నారాయణరావుగారి కొడుకును ఒక వానులో ఆస్పత్రికి పంపే ఏర్పాటు చేశారు. అంతలోనే నరసింహంగారు, ఇన్‌స్పెక్టరుగారి దగ్గరకొచ్చి, ఈ హత్యా ప్రయత్నానికి తన మేనల్లునికి ఏలాంటి సంబంధం లేదన్నాడు.

"కాదు, ఈ ఘోరాన్ని చేసింది, నరసింహం మేనల్లుడే" అన్నాడు నారాయణరావుగారు.

"శుద్ధ అబద్ధం. రుజువులు, సాక్ష్యాలు కావాలి" అన్నాడు నరసింహం.

"అవును" అన్నారు ఇన్‌స్పెక్టరుగారు.

నారాయణరావుగారు ముసుగులోవున్న మాణిక్యాన్ని ఇన్‌స్పెక్టరుగారి సమక్షంలోకి పిలిపించి "ప్రొద్దున నీవు, మావాడు కలిసి వుండగా, ఆదరి దాపులలో నరసింహం మేనల్లుడు తారట్లాడి ఆ తరువాత నీదగ్గరకువచ్చి బెదిరించి వెళ్ళాన్నాడు.....ఆ సమయంలో ఎవరైనా చూచారా మిమ్మల్ని" అని అడిగాడు.

మాణిక్యం క్షణం మౌనంధరించి "చూచారు" అంది. 'ఎవరు'అనిగద్దించాయిమూడు కంఠాలు— ఇన్‌స్పెక్టరు, నరసింహం, నారాయణరావుగార్లవి.

ముసుగు తొలగించి, మాణిక్యం గుంపుకేసి నిశితంగా చూచింది. తేరిపార చూచింది. పరీక్షగా చూచింది. ఏటిపాయ దిక్కుకేసి దృష్టి సారించింది. దూరంగా కామయ్య మేస్టారు తడి అంగవస్త్రం కట్టుకొని, చేతిలో తళ తళ మెరుస్తున్న రాగిచెంబు ధరించి, కేశవ నామాలతో రావటం కన్పించింది.

మాణిక్యం "అరుగో" అంది.

"ఆయనను తీసుకొనిరండి". ఇన్‌స్పెక్టరుగారి కంఠం నలుగురు పోలీసులుకేసి గురి చూచి అరిచింది.

* * *

"నారాయణరావుగారి అబ్బాయి, సత్యం, ఈనాటి ప్రొద్దున మాణిక్యంతో వూరి వెలుపల వుండగా నరసింహంగారి మేనల్లుడు ఆ ప్రాంతాలలో తారట్లాడి తన మాజీ ఉంపుడుగత్తె మాణిక్యాన్ని దక్కించుకోవాలనే ఉద్దేశ్యంతో సమయం కనిపెట్టి, సత్యాన్ని కత్తితో పొడిచాడు. ఈ సంఘటన జరగగా చూచినవారు లేరు. పోతే ఈ ముగ్గురు వ్యక్తులను వూరి వెలుపల చూచినట్లు సాక్ష్యం మీరట—అవునా?" ఇన్‌స్పెక్టరుగారు సూటిగా కామయ్య మేస్టారిని ప్రశ్నించారు.

కామయ్య మేస్టారు గతుక్కుమన్నారు. కళ్ళు మసకలు కమ్మినయి. ఎదురుగా మేరువులా కన్పించాడు ఇన్‌స్పెక్టరు. చెరో ప్రక్క మహామేరువులా కన్పించారు నరసింహం, నారాయణరావు గారలు.

కామయ్య మేస్త్రీకి నిలువుగ్రుడ్లు పడ్డాయి. కాళ్ళక్రింది భూమి కృంగి. పాతాళానికి ఇంకా క్రిందికి పతనమౌతున్నట్టు, తనలోరక్తం నీరవుతున్నట్లు అనిపించింది. ఒక కంటిలో నారాయణరావుగారి అతి భీకరరూపం : మరో కంటిలో ఇన్‌స్పెక్టరుగారి క్రోధ మానస భయంకర మూర్తి—???

"ఊ" అనే ఇన్‌స్పెక్టరుగారి అదలింపుతో శరీరం జలదరించి వణుకు ప్రారంభమయింది. కళ్ళు గిరగిరా తిరగటం ప్రారంభించాయి. ఈసారి కనులముందు మరేమీ కన్పించటం మానివేసింది. ఎదురుగా ఇన్‌స్పెక్టరుగారు లేరు, తుపాకులు. ఒకప్రక్క బరిసెలు, కత్తులు, మరోప్రక్క గండ్రగొడ్డళ్ళు, బాకులు చిన్నగా చీకటి ఆవరించినట్లయింది. ఆ కటిక చీకటిలో తన పెళ్ళాం బిడ్డలు జీర్ణ వస్త్రాలతో, మాడుతున్న కడుపులతో రోదిస్తున్నట్లు ఆ కటిక చీకటి కాళరాత్రిగా మారినట్లు, ఆ కాళ రాత్రిలో భయంకరమైన తుఫానుజంఝామారుతం, సప్త సముద్రాలు పొంగిన వెల్లువ—ఆ వెల్లువలో తన శరీరం తేలిపోతున్న భ్రమ.....

క్షణంలో శరీరం వెచ్చగా కాగిపోయింది—మరుక్షణంలో అతి శీతలమయింది. కర్మేంద్రియాలు పని మానివేశాయి. చూపు క్షీణించింది. నాలుక మొద్దుబారింది. మెదడు మొద్దుగా మారింది. రక్తనాళాలు స్తంభించి గుండె కరడుకట్టి, కఠినమైన శిలాకృతిదాల్చి వజ్రమైంది.

కామయ్య మేస్త్రి ఆశలు, ఆనందాలు, సుఖదుఃఖాలు, మంచి చెడుగులు, బ్రతుకు విలువలు, ఆకర్షణలు, సంఘర్షణలు అన్నీ పూర్ణాంకంనుండి శూన్యాంకాని కొచ్చాయి.

• • •

మరునాడు జిల్లా పోలీసు అధికారి వచ్చాడు—'దేవాలయోద్ధరణ' తాలూకు దొమ్మిని తన వారెలా నిరోధించారో తెలుసుకోవటానికి. దారిలో నారాయణరావుగారి కుమారుని హత్యా ప్రయత్నం తెలిసింది.

వస్తూనే "అతను చచ్చాడా" అని ప్రశ్నించారు.

సెల్యూట్ చేసిన ఇన్‌స్పెక్టరు "అవున్సార్" అన్నాడు.

"కారణం?"

"గుండె పగిలి."

"నాన్‌సెన్సు. హత్యాప్రయత్నం అనివిన్నాను" అన్నారు జిల్లా అధికారి. "మొదటిది హత్యాప్రయత్నం. ఆస్పత్రిలో అతను కోలుకొంటున్నాడు—రెండోది కామయ్య మేస్త్రీదు. మనకు కావలసిన సాక్షి. గుండెపగిలి చనిపోయాడు." విన్నవించాడు ఇన్‌స్పెక్టరు.

• • •

కథా నాయకుడు కథాంతంలో విజయం సాధించాలి: మరణించకూడదు.........

కాని ఎవరేమన్నా ఈ కథకు కథా నాయకుడు కామయ్య మేస్త్రే. ★

## (2 వ పేజీ తరువాయి)

కుండా తొందరగా పంపివేసినందుకు చింతిస్తున్నాం.

—వేము సత్యానందరావు
(ఏలూరు)

## 'గెటప్' గొప్ప

గత నాలుగైదు వారాలనుంచీ ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక బ్రహ్మాండమయిన 'గెటప్'తో అద్వితీయంగా వుంటోంది. శంకర్ బొమ్మలతో చక్కని పేపరు మీద మరింత చక్కని బ్లాకులతో అత్యాకర్షణీయంగా వుంటోంది.

—జె రామచంద్రమూర్తి
(వరంగల్)

## కథలు

మీ (మా) అభిమాన ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక (24—5—'61)లో ప్రచురించిన "గంగులు" చదివిన తర్వాత శ్రీ శీలా వీర్రాజుగార్కి నా యొక్క ధన్యవాదాలు తెల్పక ఉండలేకపోయాను. ఉత్తమమైన శైలిలో ఉద్రూతలూగించు ఈ "గంగులు"ను వ్రాసిన శ్రీ శీలా వీర్రాజు అభినందనీయులు.

—ఎ. రాజమల్లు
(బెల్లంపల్లి)

• • •

24—5—'61వ తేదీ ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రికలో "చేని గట్టున రమణమ్మ" చదివి ముగ్ధుడనైతిని. సోదరుడు అరుణాచలం తన అంతర్గత భావాలను సొంపుగా పాఠకలోకానికి అందించి వారి అభినందనలకు పాత్రులైరనుటలో సందేహము లేదు. ఇట్టి వారిని ప్రోత్సహించు మీ ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికకు నా ధన్యవాదములు.

—ఈసం. ప్రకాశం
(మద్రాసు—1)

• • •

పొలిగిన్నె—పెరుగూ అన్నం, అంతస్థు అంతఃకరణా కథలు చాలా బాగున్నాయి. ఇటువంటి మంచి కథలే ముందు ప్రచురిస్తారని ఆశిస్తున్నాను. అదీగాక మనుషులూ, మమతలూ కథలో ప్రతిమాట మానవ సహజ జీవితాన్ని గుర్తుకు తెస్తున్నాయి. రచయిత్రి వాచస్పతి గారికి నా అభినందనలు.

—వై. వి. యస్. ఆర్. ప్రసాద్
(యడ్లపూడి)

• • •

24—5—'61 వ తేదీ ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక చాలా ఆకర్షణీయముగా ఉన్నది. ముఖ్యంగా శ్రీ శీలా వీర్రాజుగారు వ్రాసిన 'గంగులు' కథ చాలా బాగున్నది. గజదొంగ 'గంగులు'లో కలిగిన మానసిక పరిణామాలను చక్కగా చిత్రించారు—

—కె. యస్. మూర్తి
(రాజమండ్రి)

• • •

ఈ వారం (24—5—'61) ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో ప్రచురించిన "గంగులు, వదినె తుమ్ము" కథలు చాలా బాగున్నవి.

పి. కృష్ణమూర్తి
(నెల్లూరు)

• • •

10—5—'61వ తేదీ పత్రికలోని కథలన్నియు బాగుగా ఉన్నవి. వాటికి తగినట్లు, శంకర్‌గారు వేసిన బొమ్మలు బాగుగనున్నవి. ప్రభ యింకను సర్వాంగ సుందరముగ వెలువడునని ఆశించుచున్నాను.

—ఆశపు మల్లికార్జునరావు
(పాలకొండ)

• • •

17—5—'61వ తేదీ సంచిక చక్కని కథలతో మనస్సుకు ఆహ్లాదాన్ని కలిగించింది. ముఖ్యంగా, 'వాచస్పతి'గారి మనుషులూ—మమతలూ చదువుతూన్నంతసేపు మనస్సు చాలా విచారపడింది. సామాన్య కుటుంబాల్లో జరిగే ఘట్టాలురసవంతంగాచిత్రించారురచయిత్రిగారు. తరువాత వీరమల్లు రామకృష్ణగారి పొలిగిన్నె, పెరుగూ అన్నం కూడా రచన చక్కగా సాగి హృదయాన్ని ఆకట్టుకోగలిగింది. అందుకు ఆ రచయితలకు ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక పాఠకలోకంతరపున అభివందన లందజేస్తున్నాను. పోతే మునిపల్లె సరోజినిదేవిగారి 'తెగిన గాలిపటం' (సీరియల్) రచన చాలా అవక తవకగా చవకబారుగా తయారవుతుంది. అసలు మగవాళ్లను దుయ్యబట్టాలనే ఉద్దేశ్యంతో కథలు వ్రాస్తూవున్నారా! అనిపిస్తూంది.

—పి జ్ఞానానందంప్రసాద్
(విజయవాడ—2)

## ఆంధ్రప్రభా, ఆడపిల్లా...

నేను ఆడపిల్లను చూచినా ఆంధ్రప్రభను చూచినా మనసు నిలుపుకోలేను. అఫ్‌కోర్సు ఆంధ్రప్రభను అయితే వెంటనే పావలా పెట్టి కొనేస్తా ననుకోండి.....

—ఎమ్. యస్. మూర్తి
(విజయవాడ)

• • •

మీ 10—5—'61 వ తేదీ ఆంధ్రప్రభ, సచిత్ర వారపత్రిక అద్భుతంగా వున్నది. ఇంత అందంగా, లోపల బయటకూడ, ఉండటం ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక చరిత్రలోమొదటిసారి అవడం ముదావహం. "శంకర్" గారి